


మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఫాంహౌస్

‘సీఎం రేవంత్‌రెడ్డి గండిపేట, హిమాయత్‌సాగర్‌లో అడ్డంగా ఉన్న ఇండ్లు తీస్తున్నరు. అది మంచి కార్యక్రమం. నేను గతంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తిని. మంచి హోదాలో ఉన్నందున నేనే ముందుండి బాధ్యత తీసుకొని నా ఫాంహౌస్‌ను తీయాల్సి ఉంటుంది. కానీ అది ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో లేదని అధికారులే నివేదిక ఇచ్చారు. ఒకవేళ నివేదిక తప్పు.. నిర్మాణం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉంటే నేనే దగ్గర ఉండి తీసేయిస్త’

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వ్యాఖ్యలు ఇవి. చుట్టూ నీళ్లతో మధ్యలో ఓ ఐలాండ్‌లా ఉన్న మహేందర్‌రెడ్డి ఫాంహౌజ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన విషయం అందరికీ తెలిసిందే. అది చూసిన ఎవరైనా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అంటూ లెక్కలు చూడరు. జలాశయంలోనే ఉంది కదా! అనే నిర్ణయానికొచ్చారు.



కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఫాంహౌస్

‘అది నేను కొన్నది. ఆ కాంపౌండ్ వాల్ నేను కట్టుకున్నది కాదు. వివేక్ వెంకటస్వామి ఫాంహౌస్ చట్టప్రకారం లేదని అంటున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నా. పరువు నష్టం దావా వేస్తా. ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల తర్వాత కట్టుకోవచ్చని చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారమే నేను నిర్మాణం చేపట్టాను. నేను ఏ విషయంలోనైనా చట్టం ప్రకారమే చేస్తాను’

- మాజీ ఎంపీ, తాజా కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఇలా సెలవిచ్చారు. కానీ జలమండలి అధికారుల నివేదికలో వివేక్ నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నాయని తేల్చారు. అందుకు నిదర్శనమే ఈ నివేదిక. అయినా.. బుల్డోజర్లకు అటువైపు వెళ్లే ధైర్యం లేదు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫాంహౌస్

‘రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మంచి ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేశారు. ఒకటే చాలెంజ్ విసురుతున్నా. హైడ్రా అధికారి రంగనాథ్‌ను ఆదేశిస్తున్నా. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు వాళ్లకు సంబంధించిన యూట్యూబ్, వ్యవస్థలు అందరూ కొత్త టేపు కొనుక్కొని నా ఇల్లు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నా, చివరకు ఒక ఇటుకపెల్ల ఉన్నా వెంటనే ఇల్లు మొత్తం పడగొట్టండి. ఇది పొంగులేటి చాలెంజ్.

- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ ఇది. తొలుత గాంభీర్యాన్ని ప్రదర్శించినా, ఆ తర్వాత గూగుల్ తల్లి మంత్రి గారి సౌధం గుట్టు విప్పింది. అంతేకాదు.. పురపాలక శాఖ 500 మీటర్ల (అర కిలోమీటరు) నిబంధన కూడా తెరపైకి రావటంతో ఇప్పటివరకు మంత్రువర్యులు నోరు మెదిపింది లేదు. రంగనాథ్ కాదు కదా.. కనీసం జలమండలి అధికారులు పాత టేపులను తీసుకొని కూడా అక్కడికి వెళ్లలేదు.

# పెద్దోళ్ల సవాల్.. పేదోళ్ల ఇండ్లు ఢమాల్

మొదటిపేజీ తరువాయి...

నిర్మాణాలు మినహా అందరూ సామాన్యులే. కొందరు నిరుపేదలు కూడా ఉన్నారు. హైడ్రా ఏర్పాటైన నెలన్నర వ్యవధిలోనే ఎందరో సామాన్యులు నిలువ నీడ లేకుండా వీధిన పడ్డారు. పైసాపైసా కూడబెట్టుకొని, జీవితాశయంగా నిర్మించుకున్న కలల సౌధాలను సర్కారు నిర్దాక్షిణ్యంగా కండ్ల ముందే నేలమట్టం చేస్తుంటే గుండెలు అవిసేలా రోదించారు. కనీసం సామాను తీసుకునే సమయమైనా ఇవ్వండంటూ కాళ్లావేళ్లా పడ్డారు. ఏ ఒక్క అధికారి గుండె కరగలేదు. ఏ ఒక్క ప్రభుత్వ పెద్ద కనికరించలేదు. మరి.. ఎన్నాళ్లీ ‘పెద్దోళ్ల సవాల్.. పేదోళ్ల ఇండ్ల ఢమాల్’ నీతి అని సామాన్యుడు ప్రశ్నిస్తున్నాడు.

### రేవంత్ చెప్పినా బుల్డోజర్లు పోవటం లేదేం?


జంట జలాశయాల పరిధిలో పెద్దోళ్ల ఫాంహౌస్‌లు అక్రమమంటూ సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే తన ప్రసంగాల్లో అధికారికంగానే ప్రకటిస్తున్నారు. ఒకటీ.. రెండు సార్లు కాదు! ఇప్పటివరకు దాదాపు ఏడెనిమిది వేదికలపై ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. పెద్దోళ్లు మురుగు వదిలితే ఆ నీటిని నగరవాసులు తాగాల్నా? అని ప్రశ్నించారు. నిజంగా ఇది అనాగరికమే! అయినా.. జంట జలాశయాల వైపు బుల్డోజర్లు మాత్రం పోవటం లేదు. ఆగస్టు 18న గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్నదంటూ ఓ పారిశ్రామికవేత్త నిర్మాణాన్ని కూల్చిన హైడ్రా, ఆపై అసలు 111 జీవో పరిధి తమది కానే కాదు.. అని నాలుక మడతేసింది. ‘కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ ఫాంహౌస్‌ను కూలగొట్టాల్నా? లేదా?’ అని రెండు రోజుల కిందట ప్రజలు ఉన్న సభలోనే సీఎం ప్రశ్నించారంటే అది అక్రమమని ఆయన ధ్రువీకరించినట్టే కదా. పక్కా సమాచారం ఉంటే తప్ప సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ధ్రువీకరించరనేది ప్రతి ఒక్కరికీ తెలిసిన సత్యమే. దీంతో కేవీపీ ఫాంహౌస్ ఎక్కడ ఉన్నదనేది కొలతలు తీయాల్సిన అవసరమూ లేదు. నిబంధనల కోసం వెతకాల్సిన పనిలేదనేది పలువురి అభిప్రాయం. కాకపోతే ఇవన్నీ కాంగ్రెస్ పెద్దల నోటి నుంచి వస్తున్నాయేగానీ, నొసలు మాత్రం అధికారులకు ఆదేశాలు ఇవ్వటం లేదు. అందుకే జంట జలాశయాల పరిధిలో ఉన్న బడాబాబుల ఫాంహౌస్‌ల జోలికి హైడ్రా వెళ్లడం లేదు. సంబంధిత జలమండలి, నీటిపారుదలశాఖ అధికారులు కూడా పోవటం లేదు. వీటి వెనుక అంతర్యమేమిటి? అంటూ ప్రజల్లో సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

### సామాన్యులకు అవకాశాలేవి?

పెద్దోళ్ల ఫాంహౌస్‌ల విషయంలో సీఎం మొదలు అధికారుల వరకు తర్జనభర్జనలు పడుతున్నారు. సవాళ్లు-ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. సమయం ఇవ్వాలని చెబుతున్నారు. కానీ గత రెండు నెలలుగా రాష్ట్రంలో.. మరీ ముఖ్యంగా హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో పేకమేడల్లా కూలిపోతున్న సామాన్యుల నిర్మాణాల విషయంలో మాత్రం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ అవకాశాలు ఇవ్వడం లేదు. ‘నోటీసులిస్తే కోర్టుకు పోతారు.. స్టే తెచ్చుకుంటారు.. అందుకే ఇవ్వటం లేదు’ అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సెలవిచ్చారంటే.. సామాన్యుడు న్యాయస్థానాలను ఆశ్రయించే ప్రాథమిక హక్కును కూడా ఈ ప్రభుత్వం హరించివేసింది.

### సామాన్యుడి ప్రశ్నలు.. జవాబివ్వు రేవంత్


- మంత్రి పొంగులేటి నా నిర్మాణం బఫర్‌జోన్‌లో ఉన్నా కూల్చేయండి అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేరు తీసుకొని ఆదేశించినా అవి అమలు కావు. సామాన్యుడు నా నిర్మాణాన్ని కూల్చొద్దని కాళ్లావేళ్లా పడినా బుల్డోజర్లు ఆగవు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, అనుమతులు, పన్ను రశీదులు చూపినా.. అవన్నీ అక్రమమే! అవసరమైతే అనుమతులు ఇచ్చిన అధికారులనూ సస్పెండ్ చేస్తామంటున్నారు.
- న్యాయవాదికి ల్యాండ్ పేపర్ చూపి అన్నీ సక్రమమే అని చెప్పాడని సీఎం అన్న తిరుపతిరెడ్డి అన్నారు. ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్టు కొనుగోలు సమయంలో తనకు తెల్వదు అని అమాయకత్వాన్ని ప్రదర్శించారు. మరి.. సామాన్యులు కూడా అంతే కదా. ఎవరైనా ఇది చెరువులో ఉన్నదని చెప్తే కొనుగోలు చేస్తారా? గతంలో అన్ని అనుమతులు ఉన్నందునే బ్యాంకు రుణాలు కూడా వస్తే ఇంటిని నిర్మించుకున్నారు. సీఎం అన్నకు ఇచ్చిన సమయం సామాన్యులకు ఎందుకు ఇవ్వడం లేదు?
- మంత్రి కోమటిరెడ్డి లేఖ రాసిన 48 గంటల్లో బుల్డోజర్లు సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేశాయి. మరి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి.. మంత్రి ఉత్తమ్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అంటే చెరువుల పరిరక్షణ అనేది ఒట్టి బూటకం అని అర్థమవుతున్నది.
- సామాన్యుల విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించటమే కాదు.. అన్ని శాఖల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. శాటిలైట్ చిత్రాలను జల్లెడ పడుతున్నారు. కానీ ఇబ్రహీంపట్నం పరిధిలో ఏకంగా నీటిపారుదల శాఖ ఇంజినీర్లు అక్రమమని తేల్చి పోలీస్ కేసులు పెట్టినా ఆ రిసార్ట్‌లు, విల్లాల జోలికి ఎవరికీ వెళ్లరు. దీని వెనుక ఉన్న మతలబు ఏంది?.



అజీజ్‌నగర్‌లోని కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రారావు ఫాంహౌస్

‘అజీజ్‌నగర్‌లోని నా ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఒక్క అంగుళం ఉన్నట్టు అధికారుల సర్వేలో తేలినా సొంత ఖర్చులతో నేనే కూల్చివేయిస్తా. కాంగ్రెస్ నేతగా నాకు మినహాయింపులు వద్దు. సాధారణ పౌరుడి విషయంలో చట్టం ఎలా వ్యవహరిస్తుందో అదే చాలు. వీలు చూసుకొని అధికారులను ఫాంహౌస్‌కు పంపండి. చట్ట ప్రకారం మార్కు చేస్తే.. ఏదైనా కట్టడం దాని పరిధిలో ఉంటే.. 48 గంటల్లో నా సొంత ఖర్చులతో కూలుస్తా. మార్కింగ్ చేసే సమయం, తేదీ ముందే ప్రకటించండి’

-తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో చెప్పిన విషయాలివి. కేవీపీ రామచంద్రారావు ఫాంహౌస్ జలాశయానికి ఆనుకొనే ఉన్నదనేది అక్కడికి వెళ్లిన ఎవరికైనా కండ్ల ముందు కనిపించే దృశ్యం. అయినా కొలుచుకోండి! కూల్చుకుంట!! అంటారు. ఎందుకంటే హైడ్రా అటు పోయేది లేదు.. కూల్చేది లేదు.



దుర్గం చెరువు పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు

‘బాజాప్తా అనుమతి తీసుకొని ఇల్లు కట్టుకున్నాను. కట్టుకునే సమయంలో ఇది ఎఫ్‌టీఎల్ ఉన్నది. బఫర్‌జోన్‌లో ఉన్నదే విషయం నాకు తెలియదు. డాక్యుమెంట్లు తీసుకున్న. న్యాయవాదికి ఇచ్చిన. అంతా సరిగా ఉన్నదంటేనే ఇల్లును కొనుగోలు చేశా. నోటీసులు ఇస్తే ఇవ్వండి. కూల్చివేతలు నా ఒక్కడి కోసం కాదు. అందరి కోసం చేస్తున్నారు. అధికారులు చేయాలి. సీఎం ఏం చేస్తాడు? అక్రమ నిర్మాణాలుంటే కూల్చివేయాల్సిందే కదా’

-సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి. దుర్గం చెరువు పరిధిలో వెలిసిన అమర్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు నెల వ్యవధితో అధికారులు నోటీసులు ఇచ్చారు. నెలన్నర గడిచినా అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈలోగా హైకోర్టు నుంచి స్టే వచ్చింది. ఇంకేముంది.. అంతా గప్‌చుప్!

‘శ్రీశైలం జాతీయ రహదారి పక్కనే చేసిన కేఎల్‌ఆర్-వర్టెక్స్ గిగా సిటీ రియల్ వెంచర్‌తో సూరం చెరువు కబ్జాకు గురైన మాట వాస్తవమే. 60.32 ఎకరాల విస్తీర్ణంలోని సూరం చెరువును కబ్జా చేసి వెంచర్ చేసినట్టుగా నేనే చాలాకాలంగా ప్రభుత్వ, అధికార యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తున్నా. కబ్జా నుంచి చెరువును విడిపించేందుకు పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించటం లేదు. చివరకు మంత్రి ఉత్తమ్‌కు సైతం ఈ చెరువు కబ్జాపై ఫిర్యాదు చేసిన. ఈ వెంచర్‌లో సూరం చెరువు మాత్రమే కాదు.. మరో పదెకరాలకుపైగా విస్తీర్ణంలో ఉన్న కొత్త కుంటను కూడా మట్టితో పూడ్చారు. దీనిపైనా అధికారులకు ఫిర్యాదు చేసిన. కేసులు కూడా నమోదు చేయించా’

- మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి వ్యాఖ్యలు ఇవి. వాస్తవానికి ఈ వెంచర్ వ్యవస్థాపకుడే కేఎల్ఆర్. ఆ తర్వాత తాను వైదొలిగానంటారు. అది వేరే విషయం. సాక్షాత్తు నీటిపారుదల శాఖ మంత్రికి ఫిర్యాదుచేసినా చట్టం చేతులు ముడుచుకొనే కూర్చున్నది.

‘రంగారెడ్డి జిల్లా కాగజ్‌ఘాట్ పరిధిలోని అలీ చెరువు విస్తీర్ణం 25 ఎకరాలు. చెరువు పరిధిలో ఎన్ఆర్ డెవలపర్స్‌కు చెందిన ముప్పాళ్ల వెంకటనర్సయ్య అక్రమ నిర్మాణాలు చేపట్టారు. తగిన చర్యలు తీసుకోండి’.

- నడి చెరువులో రిసార్టు ఏర్పాటు చేసి, విల్లాలు కట్టడంపై నీటిపారుదల శాఖ ఏఈఈ ఆర్ శారద పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు (ఎఫ్ఐఆర్-110/ 2024)లోని సారాంశమిది. అంతేకాదు.. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపడుతున్నందున చర్యలు తీసుకోవాలని డీఈఈ సైతం హెచ్ఎండీఏకు లేఖ రాశారు. ఏ ఒక్క అధికారి కన్నెత్తి చూడరు. ఎందుకంటే బీహార్ అసెంబ్లీ బలపరీక్షకు కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపు నిర్వహించింది ఇక్కడే. వారిని కలిసేందుకు రేవంత్ వస్తుండని ప్రభుత్వ నిధులతో చెరువులో రోడ్డును నిర్మించారు.

## కాంగ్రెస్ ఆట.. రఘునందన్ పాట

**హైడ్రాకు మద్దతుపై అనుమానాలు • పార్టీ ఎంపీపై బీజేపీలో రసవత్తర చర్చ**



హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): మూసీ పరీవాహక ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వ్యవహారసరళి బీజేపీలో హాట్‌టాపిక్‌గా మారింది. కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కన్నా మిన్నగా సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ సర్కార్‌ను ఆయన వెనుకేసుకొస్తున్న తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎన్ కన్వెన్షన్ కూల్చివేత నుంచి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో కూల్చివేతల్లో వేల కుటుంబాలు నిలువనీడలేక రోడ్డునపాలవుతున్నాయి. ఈ కూల్చివేతలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు అన్నతేడా లేకుండా రేవంత్‌సర్కార్‌పై ముప్పేటయుద్ధం ప్రకటిస్తున్నాయి. కానీ, ఎంపీ రఘునందన్‌రావు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంగా నిలుస్తున్నట్టు ఆయన మాటలే వెల్లడిస్తున్నాయి. ‘ఏండ్ల తరబడి నీళ్లల్ల కట్టిన ఇండ్లను కూల్చాల్సిందే. ఆ ఇండ్లకు బ్యాంకు లోన్లు ఉన్నా కూల్చివేయాల్సిందే. అలా కూల్చటం చేతకాకపోతే హైడ్రా కమిషనర్ పక్కకు తప్పుకుంటే మంచిది’ అని రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. హైడ్రాను జిల్లాలకు విస్తరించాలని సూచించారు.

### ఆయన రూటే సెపరేటు

పార్టీలు, ప్రజాప్రతినిధులు అందరూ ప్రజల పక్షాన ఉంటే ఒక్క రఘునందన్‌రావు మాత్రమే సీఎంను వెనకేసుకు రావటంలో ఆంతర్యం ఏమిటని బీజేపీలో చర్చ జరుగుతున్నది. కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల కన్నా ఎక్కువగా రఘునందన్‌రావు ఎందుకు మీదేసుకుంటున్నారు? అన్న చర్చ సాగుతున్నది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలపై హైకోర్టు సీరియస్ అయింది. న్యాయస్థానాన్ని కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

## ముందో మాట.. వెనుకో మాట!

**హైడ్రాపై కేంద్రమంత్రుల తీరు ఇదీ • వీరి ప్రోద్బలంతోనే మరిన్ని అధికారాలు**

**గవర్నర్‌పై ఒత్తిడితోనే ఆర్డినెన్స్‌కు ఆమోదం**

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): అక్రమ కట్టడాల పేరుతో పేద, మధ్య తరగతి కుటుంబాల ఇండ్లను కూల్చివేస్తున్న హైడ్రాకు సూపర్ పవర్స్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్సును గవర్నర్ ఆమోదించడం వెనుక ఇద్దరు కేంద్ర మంత్రుల సహకారం ఉన్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. పైకి మూసీ బాధితుల పక్షాన ఉన్నట్టు నటిస్తూనే లోపల హైడ్రా చట్టాన్ని బలోపేతం చేయడానికి వారిద్దరు సహకరించినట్టు సమాచారం. ఒకవైపు పేదల ఇండ్ల మీదికి బుల్డోజర్లు దింపితే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని పత్రికా ముఖంగా ప్రకటనలు చేస్తూనే.. మరోవైపు గవర్నర్ మీద ఒక రకమైన ఒత్తిడి తీసుకొచ్చి ఆర్డినెన్స్ మీద సంతకం చేయించినట్టు తెలిసింది.

### బీజేపీ ద్వంద్వ వైఖరి

హైదరాబాద్‌లోని మూసీ పరీవాహక ప్రాంతాల సందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాల ఇండ్లు కూల్చే విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నది. ఆ పార్టీ నేతలు పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు ప్రయోగిస్తే సహించం అని పత్రికా ముఖంగా ప్రకటనలు చేయడం తప్ప ఇంతవరకు ప్రత్యక్ష ఆందోళనల్లోకి రాలేదు. బాధిత కుటుంబాలను పరామర్శించలేదు. రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలను రోడ్డుపాలు చేస్తూ అమానవీయంగా వ్యవహరిస్తున్నట్టు మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా రాస్తున్నది. దీనిపై వివరణ ఇవ్వాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు. లేదంటే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రుల హోదాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఒక రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయవచ్చు. కానీ వారు ఇప్పటివరకు ఇటువంటి రాజ్యాంగ బద్ధమైన పనులేమీ చేయలేదు. కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమై జబ్బలు చరుస్తూ వస్తున్నారు.

### గవర్నర్‌పై ఒత్తిడి

**హైడ్రాకు** మరిన్ని విస్తృత అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్‌కు ఈ నెల ఒకటిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. పది రోజుల్లోనే వివాదాస్పద ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించటం ఆశ్చర్యంగా ఉంది. రాష్ట్ర క్యాబినెట్ ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపిన వెంటనే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించి ఉంటే ఫలితం మరో రకంగా ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా విధి విధానాలు, ప్రత్యేక అధికారాలు కల్పించటంపై తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని కోరి ఉంటే గవర్నర్ ఇంత తొందరగా ఆమోదం తెలిపేవారు కాదని రాజ్‌భవన్ వర్గాలు చెప్తున్నాయి. నిజానికి ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆయన దాదాపు 18 రకాల సందేహాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది.



చేవెళ్ల మండలం కౌకుంట్లలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

## ఫాంహౌస్‌లు ఎక్కడున్నాయో చూపించండి

**ఉంటే చట్టరీత్యా కూల్చేయండి • సీఎం రేవంత్‌రెడ్డికి సబితారెడ్డి డిమాండ్**

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 4 : తన కుమారులకు ఫాంహౌస్‌లు ఉన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారని, అవి ఎక్కడున్నాయో ఆయనే చెబితే బాగుంటుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని స్వగ్రామమైన కౌకుంట్లలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఏది మాట్లాడాలో, ఏది మాట్లాడకూడదో తెలియని పరిస్థితిలో రేవంత్ రెడ్డి ఉన్నారని విమర్శించారు. తన కుమారులకు ఫాంహౌస్‌లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. అవి ఎక్కడున్నాయో ఆయనే స్వయంగా చూపిస్తే బాగుంటుందని డిమాండ్ చేశారు. ఫాంహౌస్‌లు ఉన్నాయని నిర్ధారిస్తే చట్టరీత్యా కూల్చివేసుకోవచ్చని సూచించారు. లేనివి ఉన్నట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతతో మాట్లాడితే బాగుంటుందని సూచించారు.

## మా కన్నీళ్లు తుడిచేదెవరు?

**మూసీవాసుల రోదన.. కొనసాగుతున్న ఆపరేషన్ రివర్‌బెడ్**

**మూసీ పరీవాహక ప్రాంతాల్లో తహసీల్దార్ల బృందాలు**

**నిర్వాసితులను తరలిస్తున్న అధికారులు.. నిర్వాసితుల ఆవేదన**

హైదరాబాద్ సిటీబ్యూరో/ఎల్బీనగర్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : మూసీ ఆపరేషన్ నిర్వాసితుల్లో దడ పుట్టిస్తున్నది. తహసీల్దార్ల బృందం మూసీ పరీవాహక ప్రాంతాల్లో సంచరిస్తూ నిర్వాసితులను ఒప్పించే యత్నం చేస్తున్నది. ఆ బృందాలను చూస్తేనే అక్కడి జనం వణికిపోతున్నారు. విడదసీ.. తరలించు అన్నట్టుగా ఒక్కో బృందం కొన్ని కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వారిని ఖాళీ చేయించే చర్యలకు పాల్పడుతున్నది. శుక్రవారం సైదాబాద్, నాంపల్లి, ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో అధికారులు నిర్వాసితులతో చర్చించారు. తమంతట తాము ఖాళీ చేస్తే రూ.25 వేల పారితోషకం ఇస్తామంటూ ఆశ చూపించారు. కానీ చాలామంది తమ గూడును వదలడానికి అంగీకరించలేదు. కొంతమంది పెద్ద దిక్కులేని వాళ్లు భయంగానే అంగీకరించినట్టు చెప్తున్నారు. సైదాబాద్‌లో 32 కుటుంబాలను ఉప్పల్‌లోని ప్రతాపసింగారం డబుల్ బెడ్రూం ఇండ్లకు తరలించినట్టు అధికారులు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని, మూసీ పరీవాహకంలోని తమ ఇండ్లజోలికి రాకుండా చూడాలంటూ కొంతమంది మూసీ నిర్వాసితులు ఫణిగిరికాలనీ వెంకటసాయినగర్‌లోని సాయి సన్నిధి ఆలయంలో సాయిబాబాకు వినతి పత్రం అందజేశారు.

### పండుగ పూట ఏడ్చినం

‘డబ్బులు పెట్టి జాగాలు కొనుక్కొని ఇండ్లు కట్టుకున్నం. మాది అక్రమ నిర్మాణం అంటే చెప్పుతో కొడతాం. ఎవడొస్తడో రమ్మను రేవంత్‌రెడ్డి. నిన్న, ఇయ్యాల వచ్చి మా ఇండ్లు కూల్చివేస్తానంటే ఎలా? ఇక్కడి నుంచి పోయి



ఎక్కడో చెత్త కుప్ప ప్రాంతంలో ఉండాలంటే ఎందుకు పోతాం? మా బాధలు ఏం చూసిండు రేవంత్‌రెడ్డి? మా వద్దకు రమ్మను. ఇండ్ల కూల్చివేతను మానుకుంటేనే మంచిది. లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. సీఎం సీటు నుంచే దింపేస్తం. మా ఇండ్లలో మేమే ఉంటాం. కొత్తపేటలోని పట్టాదారుల నుంచి కొనుగోలు చేశాం. మేం 35 ఏండ్ల క్రితం స్థలాలు కొని కట్టుకున్నాం. సీఎం పదవిలో ఉండి తాను ఏం మాట్లాడినా నడుస్తది అని రేవంత్‌రెడ్డి అనుకుంటే ఎట్లా? ఇల్లు పోతుందనే బాధతో ఏడ్చుకుంటూ బతుకమ్మను ఆడినం. అందుకే రేవంత్‌కు వ్యతిరేకంగా పాట పాడినం. మేం ఒక్కరం కాదు.. హైదరాబాద్ మొత్తం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నది. పాట పాడుతున్నది.

- ఓ మహిళ ఆక్రందన

## కబ్జాదారులం కాదు.. యజమానులం

మొదటిపేజీ తరువాయి...

ఎలా? అది ప్రభుత్వ స్థలం అని, తామంతా కబ్జాదారులం అని అంటే ఎలా? అని మూసీ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ‘సీఎం రేవంత్‌రెడ్డి మమల్ని భూకబ్జాదారులు అంటున్నారు. మేం భూకబ్జాదారులం కాదు. ఈ స్థలాలను కొనుకున్న యజమానులం. మా స్థలాల రక్షణ కోసం పోరాటం చేస్తున్నాం’ అంటూ కన్నీరుమున్నీరయ్యారు. దశాబ్దాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు ఆ జాగా తమది కాదని అధికారులు చెప్తుంటే ఏం చెయ్యాలో పాలుపోవటం లేదని వాపోతున్నారు. ‘ఇదంతా పట్టా స్థలమని గ్రామపంచాయితీ అనుమతులతో లే అవుట్లు ఏర్పాటు చేశాకే కొనుగోలు చేశాం. అన్ని అనుమతులతో ఇండ్లను కట్టుకున్నాం. పట్టా స్థలాల్లో నిర్మించిన ఇండ్ల జోలికి రాకుండా మూసీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి. మూసీ ప్రాజెక్ట్ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలి’ అని ఎల్బీనగర్ నియోజకవర్గం మూసీ పరీవాహకంలోని చైతన్యపురి, కొత్తపేట డివిజన్లలోని కాలనీలు, బస్తీల ప్రజలు కోరుతున్నారు.

### హైకోర్టు నుంచి స్టేలు

అన్ని అనుమతులతో నిర్మించిన తమ ఇండ్లను కూల్చేందుకు ప్రభుత్వ అధికారులు రావడంపై చైతన్యపురి ఫణిగిరికాలనీ శ్రీ వెంకటసాయినగర్ కాలనీ వాసులు సుమారు 17 మంది హైకోర్టు నుండి స్టేలు తీసుకున్నారు. తాము అన్ని అనుమతులతో ఇండ్లను నిర్మించుకుంటే ఇలా మూసీ ప్రాజెక్ట్ పేరుతో తమ నివాసాలను కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఫణిగిరికాలనీకి చెందిన మరో 16 మంది కూడా హైకోర్టును ఆశ్రయించారు.

### అనుమతులు ఉన్న ఇండ్లను వదిలేయాలి

ముందు మూసీ ప్రాజెక్ట్ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలి. అన్ని అనుమతులతో నిర్మించిన నివాసాలను వదిలి మూసీ ప్రాజెక్ట్‌ను చేపట్టాలి. పట్టా స్థలాలు వదిలి మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలి. మూసీ లోయర్‌లో ఉన్న వారికి కూడా తహసీల్దార్ కన్వీన్స్ డీడ్ ఇచ్చారు. 1978లో గ్రామపంచాయితీ లే అవుట్‌తో ప్లాట్లు కొన్నాం.



- నర్సింహప్రసాద్, వెంకటసాయి నగర్, చైతన్యపురి

### అప్పు చేసి జాగా కొనుక్కున్నాం



ఎంతో శ్రమించి, కష్టపడి సంపాదించి కూడబెట్టిన డబ్బులు, కొంత అప్పు చేసి ఇటీవలే ఫణిగిరి కాలనీలో 160 గజాల స్థలాన్ని రూ.40 లక్షలకు కొనుగోలు చేశాను. ఇల్లు కట్టుకోవాలని కలలు కంటున్నాను. అంతలోనే పిడుగుపాటు వార్త వినిపించింది. ఈ స్థలం రివర్‌బెడ్‌లో ఉన్నదంటూ మార్కింగ్ చేశారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- గొల్లపూడి వేణుగోపాల్, ఫణిగిరి కాలనీ

### 25 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నా



కార్పెంటర్‌గా కాయాకష్టం చేసి సంపాదించిన డబ్బుతో 25 ఏండ్ల క్రితం 100 గజాల స్థలంలో ఇల్లు కట్టుకుని ఉంటున్నాం. ఇప్పుడు మూసీ అభివృద్ధి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మా ఇండ్లను కూల్చేందుకు సిద్ధం అవుతున్నాడు. మూసీకి 100 మీటర్ల దూరంలో ఉన్నా మా ఇంటికి రివర్‌బెడ్ అంటూ మార్కింగ్ చేశారు. మా కుటుంబ పరిస్థితి ఏమిటి? మూసీ అభివృద్ధి చేయాలి కానీ కానీ పేదల ఇండ్లను కూల్చొద్దు.

- వీరాచారి, ఫణిగిరి కాలనీ